క్లుప్తంగా

ఉదయ్‌భాస్కర్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం పరిశోధక విద్యార్థి జె.ఉదయ్‌భాస్కర్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన ప్రొఫెసర్ బి.హేమలత పర్యవేక్షణలో మ్యూజిక్ యాజ్ ఏ క్యాటలిస్ట్ ఇన్ ఎన్రిచింగ్ సెలెక్ట్ గ్రూప్ ఆఫ్ పీపుల్ అను అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ పట్టా సాధించిన ఆయన్ను పలువురు ప్రొఫెసర్లు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

బంగారు తిరుచ్చిపై శ్రీకల్యాణ వెంకన్న



బంగారు తిరుచ్చిపై భక్తులను అనుగ్రహిస్తున్న స్వామి, అమ్మవార్లు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు మంగళవారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులను కటాక్షించారు. స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అభిషేక సేవ నిర్వహించి, మరకత మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం విద్యుత్ దీపాలంకరణ మధ్య దేవేరులకు ఊంజల్‌సేవ చేపట్టారు. సర్వాలంకార శోభితుడైన స్వామి, అమ్మవార్లు బంగారు తిరుచ్చిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, చెంగయ్య, అర్చకులు రాజశేఖర్ స్వామి, రవిచంద్రన్, జమేదారు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్‌రెడ్డి లా కాలేజ్‌పై నిషేధం

తిరుపతి సిటీ: రాష్ట్రంలోని లా కళాశాలలపై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కొరడా ఝుళిపించింది. ఇందులో భాగంగా ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో నడుస్తున్న ఏర్పేడు మండలం అంజిమేడులోని ఈశ్వర్‌రెడ్డి లా కాలేజ్‌పై నిషేధం విధించింది. ఈ మేరకు మంగళవారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు అందేవరకు కళాశాలలో అడ్మిషన్లు చేపట్టరాదని ఆదేశించింది.

సఖి వన్ స్టాప్ సెంటర్‌లో మెరుగైన వసతులు



సఖి వన్ స్టాప్ సెంటర్ వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ యోగేష్ దూబే

తిరుపతి తుడా: తిరుపతి ఓల్డ్ మెటర్నిటీ భవనంలోని సఖి వన్ స్టాప్ సెంటర్, గృహ హింస చట్టం విభాగం కేంద్రాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ స్పెషల్ మానిటర్ డాక్టర్ యోగేష్ దూబే మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అందులోని బాధితులను పరామర్శించారు. అక్కడ అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. తాత్కాలిక భవనంలో నిర్వహించడంపై ఆయన కారణాలను ఆరాతీశారు. ఈ సందర్భంగా డాక్టర్ యోగేష్ దూబే మాట్లాడుతూ ఈ కేంద్రంలోని బాధితులకు మెరుగైన సేవలు, సౌకర్యాలను అందించాలని సూచించినట్లు చెప్పారు. త్వరలో కేంద్ర ప్రభుత్వ నిధులతో సొంత భవనాన్ని నిర్మించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సెంటర్‌లో ఖాళీలను భర్తీ చేయించేలా చూస్తానని హామీ ఇచ్చారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి ఎస్.జయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్, సఖి వన్ స్టాప్ సెంటర్ సెంటర్ అడ్మిన్ సుజాత, గృహ హింస చట్టం విభాగం కౌన్సిలర్ సుగుణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు ముందస్తు బెయిల్

తిరుపతి లీగల్: సార్వత్రిక ఎన్నికల అనంతరం జూలై 13వ తేదీన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసులో రెండో నిందితుడిగా అభియోగాలు ఎదుర్కొంటున్న భోస్ చంద్రారెడ్డికి చిత్తూరు ఆరో అదనపు జిల్లా జడ్జి కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్టు సీనియర్ న్యాయవాది నరహరిరెడ్డి మంగళవారం తెలిపారు. టీడీపీకి చెందిన ఓ మహిళా కార్యకర్త ఫిర్యాదు మేరకు చంద్రగిరి పోలీసులు 13 మందిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాల మేరకు చంద్రారెడ్డి మంగళవారం రూ.20 వేలు, ఇద్దరు జామీనుదారుల పూచీకత్తును తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. దీంతో కోర్టు అతనికి బెయిల్ మంజూరు చేసింది.

ఆక్రమణలపై ఉక్కుపాదం

- రైల్వేస్టేషన్ ఎదురుగా స్పెషల్ డ్రైవ్
- రోడ్డు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి హోటళ్ల నిర్వహణ
- తొలగించడంతో సాఫీగా ప్రజారవాణ



తొలగించబడిన రోడ్డు ఆక్రమణలు

తిరుపతి తుడా: నిత్యం వేలాది మంది యాత్రికులు, వాహనాలతో రద్దీగా ఉండే తిరుపతి రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. ఫుట్‌పాత్‌లు, రోడ్లను సైతం ఆక్రమించి ప్రజా రవాణాకు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నారు. ఈ ఆక్రమణల కారణంగా ఉదయం, సాయంత్రం వేళల్లో రైల్వే స్టేషన్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. దుకాణదారులు ఒకరిపైఒకరు పోటీపడి ముందుకు జరిగి, ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడ్డారు. దీంతో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన కమిషనర్ ఆక్రమణలు తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రంగంలోకి దిగిన మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం సిబ్బందితో కలిసి ఆక్రమణలపై ఉక్కుపాదం మోపారు. రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపున నేతాజీరోడ్డు నుంచి ఈస్ట్ పోలీస్ స్టేషన్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలను ఉపేక్షించకుండా తొలగించారు. రికార్డుల ప్రకారం తనిఖీలు నిర్వహించి ఫుట్‌పాత్ వరకు ఉన్న ఆక్రమణలను జేసీబీ సహాయంతో తొలగించారు. అడ్డుగా ఏర్పాటు చేసిన స్టవ్‌లు, నేమ్ బోర్డులు, ముందుభాగంలోని షెడ్‌లు, వంట సామగ్రిని తీసివేయించి తరలించారు. ఏసీపీ బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ఆక్రమణలను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. ప్రజా రవాణాకు ఆటంకం కలిగించేవారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రైల్వేస్టేషన్‌కు ఎదురుగా ఇష్టారాజ్యంగా కాలువ, ఫుట్‌పాత్‌లతోపాటు ఏకంగా రోడ్డుపైకి ఆక్రమణలు వచ్చేశాయన్నారు. వీటిపై ఫిర్యాదులు రావడంతో తొలగించామని చెప్పారు. నగరంలో ఫుట్‌పాత్, రోడ్లను ఆక్రమించి ఉంటే వెంటనే ఎవరికి వారు తొలగించుకోవాలని ఆయన సూచించారు.



రైల్వే స్టేషన్ వద్ద తొలగించబడిన ఆక్రమణలు

శెట్టిపల్లి భూ బాధితులకు న్యాయం చేస్తాం



శెట్టిపల్లి భూములను పరిశీలిస్తున్న తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్

తిరుపతి మంగళం: ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడుతున్న శెట్టిపల్లి భూ బాధితులకు త్వరలోనే న్యాయం జరిగేలా చేస్తామని తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. మంగళవారం కార్పొరేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి శెట్టిపల్లి భూములను ఆమె పరిశీలించారు. శెట్టిపల్లి భూ పరిరక్షణ కమిటీ నాయకులతోపాటు సీపీఎం, సీపీఐ నాయకులు, భూ బాధితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తమ భూములకు హక్కు కల్పిస్తూ ప్రొసీడింగ్స్ ఇచ్చారని కమిషనర్‌కు వారు వివరించారు. ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో తమ సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని, తమకు న్యాయం చేసి తమ స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలని బాధితులు వేడుకున్నారు. దీనిపై స్పందించిన కమిషనర్ తిరుపతి కార్పొరేషన్ పరిధిలో ఉన్న శెట్టిపల్లి భూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ నారాయణరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌రెడ్డి, సర్వేయర్ వెంకటరమణ, వీఆర్‌ఓ భూపతి, సీపీఎం నాయకులు సుబ్రమణ్యం, వేణు, శెట్టిపల్లి భూ పరిరక్షణ కమిటీ నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, రాజేంద్ర, సురేష్ పాల్గొన్నారు.

రాస్‌లో బాలల సంరక్షణపై సమావేశం



మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి రమేష్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: చైల్డ్ ఫండ్ వారి ఆర్థిక సహకారంతో రాస్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం బాలల రక్షణ విధానంపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వివిధ రకాల ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసే సిబ్బంది పిల్లలతో పని చేసిన వారి అనుభవాలను పంచుకున్నారు. ప్రాజెక్టు అధికారి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. అందరూ కలిసి ఐకమత్యంగా జిల్లా స్థాయి ఫోరం ఏర్పాటు చేయడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు పిల్లలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటిని పరిష్కారించాలని అందరూ కలిసి చర్చించి నిర్ణయం తీసుకున్నారు. డీసీపీయూ కాల్పు, ఆర్‌పీఎఫ్ రామకృష్ణారెడ్డి, ఎస్ఐఆర్‌డీఎస్ హిమశేఖర్, బాలోత్సవం గురునాథం, వేమన విజ్ఞాన కేంద్రం మునిలక్ష్మి, రీల్స్ సంస్థ కృష్ణమూర్తి, ఎంఎస్‌కే సంస్థ తేజస్విని, ఎంఎస్‌కే ప్రతినిధులు రాధిక, షర్మిల, దినేష్, యునిటెడ్ వే సంస్థ ఉష, ధాత్రి ప్రతినిధి స్వాతి, సీడీపీఓ సుధారాణి, ప్రగతి సంస్థ రెహ్మతుల్లా, నవ భారత్ సేవా సమాజ్ కో–ఆర్డినేటర్ భారతి, వీఎల్‌సీపీసీ సభ్యులు, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి



మాట్లాడుతున్న క్రిష్టారెడ్డి

తిరుపతి కల్చరల్: కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, వారి దోపిడీకి సహకరిస్తున్న జిల్లా అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు క్రిష్టారెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది చాలా కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను మీరి, అనుమతులు లేకుండా ప్రారంభించినా కూడా వారిపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. విద్యార్థి సంఘాలు అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. మరోపక్క ప్రైవేటు కార్పొరేట్ స్కూళ్లు, కళాశాల యాజమాన్యం అడ్మిషన్ ఫీజు, బుక్స్, యూనిఫాం తదితరాల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి జిల్లాలో జరుగుతున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని నిలువరించాలని, వారికి సహకరిస్తున్న జిల్లా స్థాయి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఆగమోక్తంగా సంకట హర చతుర్థశి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీఅంజిఅంజి వినాయకస్వామి సన్నిధిలో మంగళవారం ఆగమోక్తంగా సంకట హర చతుర్థశి పూజలు నిర్వహించారు. ఈ పూజలను ప్రతి కుటుంబం నిర్వహించుకునే విధంగా దేవస్థానం ఆర్జిత సేవగా తీసుకువచ్చింది. మంగళవారం ఆలయ ఆవరణలో ధ్వజస్తంభం సమీపంలో ఉండే శ్రీఅంజిఅంజి వినాయకస్వామి సన్నిధిలో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించి, దీపధూప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు.

స్థల ఆక్రమణపై విచారణ చేయించండి



మాట్లాడుతున్న బాధితుడు టి.గోపినాథ్

తిరుపతి కల్చరల్: తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించి వెంకటసుబ్బమ్మ కుటుంబం అక్రమంగా దారి లేకుండా నిర్మాణాలు చేపడుతుంటే అడ్డుకున్నామని, స్థల ఆక్రమణపై అధికారులు విచారణ చేసి న్యాయం చేయాలని బాధితుడు టి.గోపినాథ్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. అక్కారాంపల్లి గ్రామ సర్వేనెంబర్ 12/1లో కొర్లగుంట సంజయ్‌గాంధీ కాలనీ 219,219/ఏ రెండు ప్లాట్లులో 4 సెంట్లు భూమి ఉందని తెలిపారు. అయితే వెంకటసుబ్బమ్మ ప్లాట్ నెంబరు 217సీ అని, ఆమె స్థలం రోడ్డుకు పోయిందన్నారు. అయితే ఆమె టిఫిన్ అంగడి నిర్వహిస్తూ తమ స్థలాన్ని ఆక్రమించి, దారి లేకుండా అడ్డుగా నిర్మాణాలు చేపడుతుంటే అడ్డు చెప్పామని తెలిపారు. ఈ స్థల వివాద సంఘటనకు సంబంధించి సర్వే చేయాలని అధికారులు వెంకటసుబ్బమ్మ కుటుంబాన్ని కోరినా అంగీకరించక దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. దీంతో తాము పోలీసులను ఆశ్రయించి, న్యాయం చేయాలని కోరామని తెలిపారు. అయితే వారి ఇంటి స్థలాన్ని తాను కబ్జా చేస్తున్నానంటూ తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్థల వివాదం సంఘటనపై స్పందించి విచారణ చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

శాస్త్రీయ దృక్పథం పెరగాలి



శ్రీకాళహస్తి: మూఢ నమ్మకాలను కూకటివేళ్లతో పెకలించాలంటే అందరిలో శాస్త్రీయ దృక్పథం పెరగాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్యభవన్‌లో మంగళవారం సీపీఎం శాఖ కార్యదర్శుల నాలుగురోజుల రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ తమ స్వార్థ రాజకీయాల కోసం భౌతిక వాదానికి బదులు మతభావ వాదాన్ని ప్రజల్లో ప్రేరేపిస్తున్నాయని తెలిపారు. మూఢ నమ్మకాలు పెరిగితే భావితరాల భవిష్యత్తుకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. సామాజిక రుగ్మతలను తరిమి కొట్టాలంటే ప్రతి కార్యకర్తల అసలైన భౌతికవాదిగా మారాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు అంగేరి పుల్లయ్య, నాగరాజు, గంధం మణి, పెనగడం గురవయ్య, కుమార్, వెంకటేష్, మనోహర, వెలివేంద్రం, కుప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ శంషాద్ బేగం

దక్కిలి: బాల్య వివాహాలను నియంత్రించాలని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాబేగం తెలిపారు. మండలంలోని వీకేపై సముద్రం (కొత్తపల్లి), మాధవయ్యపాళెం, వెలిగల్లు అంగనవాడీ కేంద్రాల్లో మంగళవారం బాల్యవివాహాల నియంత్రణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సీడీఓపీఓ మాట్లాడుతూ చిన్నవయస్సులో వివాహాలు చేస్తే ఎదుగదల లేకుండా పోతుందన్నారు. దీనివల్ల భవిష్యత్తులో తల్లికి, పుట్టే బిడ్డలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం గురుదక్షిణామూర్తి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల కోసం మంగళవారం పట్టణానికి చెందిన వెంకటముని పెట్రోల్‌బంకు యజమాని మహేష్ పలకలు, పుస్తకాలు, పెన్నులు, బలపాలను వితరణగా అందజేశారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.



విద్యాసామగ్రిని అందజేస్తున్న మహేష్

కళాశాలలో పుస్తకావిష్కరణ

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో 'ప్రోగ్రామింగ్ ఇన్ సీ విత్ ల్యాబ్ ఎక్సర్‌సైజెస్' అనే పుస్తకాన్ని మంగళవారం ప్రిన్సిపల్ శ్రీలత ఆవిష్కరించారు. కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకుడు ఏ.రవికుమార్ మరో ముగ్గురితో కలిసి బీసీఏ కోర్సు మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్‌కు సంబంధించి ఈ పుస్తకాన్ని రచించారు. పుస్కక ఆవిష్కరణ అనంతరం రవికుమార్‌ను ప్రిన్సిపల్ అభినందించారు. అధ్యాపకులు నరసింహవర్మ, బాపనయ్య, మునెయ్య, సతీష్‌కుమార్, సత్యనారాయణరెడ్డి, రాజేంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు



తడి, పొడి చెత్త బుట్టలను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్



స్వీపింగ్ మిషన్ పనితీరు పరిశీలన

- ప్రతిరోజూ నీటి సాంద్రత పరీక్షలు నిర్వహించాలి
- కమిషనర్ అదితి సింగ్

తిరుపతి తుడా: తిరుపతి నగర ప్రజలు, యాత్రికులను దృష్టిలో ఉంచుకుని మెరుగైన పారిశుధ్యాన్ని అమలు చేయాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితి సింగ్ హెచ్చరించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న నీటి సాంద్రత పరీక్షలు ప్రతి రోజూ నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం ఉదయం 5.30 గంటల నుంచి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌తో కలిసి కమిషనర్ నగరంలో సుడిగాలి పర్యటన చేశారు. పారిశుధ్య కార్మికుల పనితీరు, సిబ్బంది హాజరు, ఇంటింటా చెత్త సేకరణ, స్వీపింగ్ మిషన్స్ పనితీరును పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణ ఎలా జరుగుతోందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యం విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణ యజమానులు కచ్చితంగా నిర్దేశించిన సమయంలోనే చెత్తను సిబ్బందికి అందించాలని, ఎక్కడైనా పారబోస్తే ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని తెలిపారు. జరిమానా కూడా విధించాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. మురుగు కూపాలు, కాలువల్లో తరచూ బ్లీచింగ్ చల్లాలని ఆదేశించినట్టు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో కాలువలు పాడైపోడాన్ని గుర్తించారు. వీటిలో మురుగు నీరు సాఫీగా వెళ్లేలా మరమ్మతులు చేయించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారులు, అంతర్గత రోడ్లు అన్ని ప్రతి రోజు శుభ్రం చేయాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌ను సూచించారు. డీఈఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్స్ చెంచయ్య, సుమతి, సచివాలయ కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ అదితిసింగ్ యూనియన్ నాయకులకు హామీ ఇచ్చారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులతో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. కార్మికులు తెలుపుతున్న సమస్యలన్నీ సహేతుకంగా ఉన్నాయని, ఆయా సమస్యల పరిష్కారానికి త్వరలోనే కృషి చేస్తామన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రెసిడెంట్ తులసేంద్ర, వైస్ ప్రెసిడెంట్ దొరస్వామి, జనరల్ సెక్రటరీ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, బీమా సౌకర్యాలపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమస్యలను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈఈ విజయకుమార్ రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రదీప్, ఉమాపతి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం..కల్యాణం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధి శ్రీదేవి భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా మంగళవారం కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీస్వామి అమ్మవార్లకు క్షీర, కుంకుమ, చందనాభిషేకా పూజలను నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేదపండితులు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు



స్వామి,అమ్మవార్ల కల్యాణం